కథ

# హక్కు

మంచులో తడిసిన గడ్డిలో అడుగులేసి నడుస్తుంటే పాదాలకు చక్కిలిగిలి పెట్టినట్టయి మనసుకెంతో హాయిగా వుంది. ఆ పార్కులో రోజూ మార్నింగ్ వాక్‌కు రావడంతో రాఘవరావుగారి దినచర్య మొదలవుతుంది.

ఆయన ఓ పచ్చని చెట్టు పక్కనున్న బెంచీపై కూర్చుని చుట్టూ పరికించి చూసారు. ఎవరో ఆత్మీయుణ్ణి చూసి పలకరిస్తున్నట్టుగా కొమ్మలమీదున్న పక్షులు కిచకిచమంటూ పలకరించాయి.

ఆ చిన్నారి పిచుకల కిచకిచలు వినగానే కొద్దిదూరంలో వున్న తల్లి పక్షి, పిల్ల పిచుకల దగ్గర వాలి నోటితో వాటికి ఆహారం అందిస్తుంటే ఆ దృశ్యం చూసిన ఆయన కళ్లల్లో ఆనందం పొడసూపింది.

బెంచి క్రింద బుల్లి కుక్కపిల్లలు కుయ్‌కుయ్‌మంటూ పిలవగానే వాటి తల్లి వాటిదగ్గరే చేరి పాలియ్యసాగింది.

ఆయన ఆ దృశ్యం చూడగానే ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చారు.

ఇంటి

దగ్గరుండే తన

ముద్దుల మనవరాలు సృజన గుర్తుకొచ్చి మొహంలో విషాద ఛాయ అలముకొంది. ఈపాటికి మూడేళ్లయినా నిండని సృజనకు తన కొడుకు, కోడలు ఇచ్చే ట్రైనింగు తంతు ముగిసి వుండొచ్చని ఇంటికి బయలుదేరారు రాఘవరావుగారు.

★ ★ ★

ఏ దృశ్యమైతే చూడకూడదనుకొని మెల్లగా అడుగులేస్తూ ఇంటికొచ్చారో ఆ దృశ్యమే కళ్లపడింది.

''అమ్మా పాలు కావాలే...'' ముద్దుగా తల్లిని అడుగుతోంది సృజన.

అంతే రావుగారి కోడలు లలిత కస్సుమని ఇంతెత్తున లేస్తూ తర్జనితో కూతురిని బెదిరిస్తోంది.

''డోంట్ సే అమ్మా... సే మమ్మీ''

''చారీ... చారీ...'' అంటోంది సృజన.

మూడేళ్ల సృజనకి బోలెడు డొనేషన్ కట్టి సిటీలోని ఓ పేరుమోసిన కాన్వెంట్‌లో చేర్చారు. అయితే ఆ పసిదానిచే ఇంగ్లీషు భాషలో మాట్లాడించాలన్నదే ఆ తల్లిదండ్రుల తాపత్రయం.

యూనిఫారం, బూట్లు, బండెడు పుస్తకాలు మోయలేక మోస్తూ బడికెళ్లింది సృజన.

★ ★ ★

సాయంత్రమవగానే పంజరం నుండి వదిలిన పక్షిలా నానమ్మ ఒళ్లో చేరింది. మనవరాలిని గుండెలకు హత్తుకున్న అన్నపూర్ణమ్మ సృజన ఫ్రాకు తడిగా వుండటం గమనించింది.

''ఏం తల్లీ బళ్లో బాత్రూమ్ లేదా?''

''ఉంది...''

''మరి టీచర్‌ను అడిగి వెళ్లి వుండాల్సింది'' బట్టలు మార్చి పెరుగన్నం పెడ్తూ అడిగింది.

''నానమ్మా ఎలా అడగను. స్కూల్లో మాట్లాడితే ఇంగ్లీషులో మాట్లాడాలి. నేను లేచి టీచరును అడుగుదామనుకున్నప్పుడల్లా ఆవిడేమో ఇంగ్లీషులోనే చెప్పాలంటుంది. నాకేమో ఎలా చెప్పాలో తెలియదు...'' అమాయకంగా చెప్పింది సృజన.

ఇంతలో ఆఫీసు నుండి అప్పుడే వచ్చిన తల్లిదండ్రులు సృజనను తమ గదిలోకి లాక్కెళ్లి హోమ్ వర్క్ చేయించడంలో మునిగిపోయారు.

★ ★ ★

ఇంకోరోజు తాతయ్య ఒడిలో చేరి ''తాతయ్యా నేనా బడికి వెళ్లను...'' అంది సృజన.

''ఎందుకు తల్లీ...'' ముద్దుగా అడిగారు.

''ఏంటో తాతయ్యా ఆ బళ్లో ఎవ్వరూ మాట్లాడరు. ఎందుకంటే మేం తెలుగులో మాట్లాడుకుంటే టీచరు కొడుతుంది. అందుకే మేం ఎవ్వరమూ మాట్లాడుకోము...''

వింటున్న రాఘవరావుగారి మనసు వికలమయ్యింది. పసివాళ్లను నోరెత్తకుండా హింసిస్తున్న అమానుషత్వానికి చలించిపోయారు.

మరునాడు ఉదయమే సృజనతోబాటుగా స్కూలుకు వెళ్లి ఆ టీచర్లను మందలిద్దామనుకున్నాడు కాని అన్నపూర్ణమ్మ వద్దని వారించింది.

బోలెడు డబ్బు కట్టి సృజనను ఆ స్కూల్లో చేర్చారు. ఇప్పుడు టీచర్లతో గొడవ పడితే స్కూల్లోంచి పేరు తీసేస్తే కొడుకూ, కోడలు బాధపడ్తారని వారించింది.

★ ★ ★

చూస్తుండగానే చిల్డ్రన్స్‌డే వచ్చేసింది.

ఆరోజు విద్యామంత్రి ముందు చిన్నపిల్లలు రకరకాల విన్యాసాలు ప్రదర్శించాల్సి వుంది.

చిన్నపిల్లలంతా రోజుకంటే ముందుగా స్కూలు చేరుకున్నారు. ఉదయం నుంచే మంత్రిగారి ఆహ్వానానికై సృజన లాంటి పసిపిల్లలంతా చేతుల్లో గులాబీ పూలు పట్టుకొని నిల్చున్నారు.

ఉదయం నిల్చున్నప్పుడు చేతిలో గులాబీ మొగ్గలతో ఆ పసివాళ్లంతా అప్పుడే విరిసిన పూలల్లా తాజాగా ముద్దొచ్చేలా వున్నారు. టీచర్లంతా హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

గంట గడిచింది.

రెండు గంటలయింది.

మంత్రిగారి జాడ లేదు.

పిల్లలంతా కదలకుండా ప్రతిమల్లా నిల్చున్నారు. సృజనకు నీరసం ఆవహించింది. దాహం వేయసాగింది.

టీచర్‌ను అడగాలంటే ఇంగ్లీషులో అడగాలి. కాని ఎలా అడగాలో ఆ పసిదానికి తోచలేదు. అలాగే నిల్చుంది. ఇంతలో పక్కనున్న పొదల్లోంచి ఏదో పురుగు వచ్చి కుట్టడంతో పసిదాని బాధ రెట్టింపైంది. కళ్లవెంట నీళ్లు కారసాగాయి.

ఏ కళనుందో ఓ టీచర్ సృజనను చూసి ''వాట్ హేపెండ్?'' అంటూ ఇంగ్లీషులో గద్దించింది.

సృజన ''మరే...మరే...'' అంటూ ఏదో చెప్పబోయింది.

''ష్!...డోన్ట్ టాక్ టెల్గు...'' గుడ్లురిమి చూసింది టీచర్.

మౌనంగా దుఃఖం దిగమింగుకొని అలాగే నిల్చుంది సృజన.

మంత్రిగారింగా దయచేయనేలేదు.

ఉదయం సరిగ్గా తినకపోవడం వల్లను, పురుగు కుట్టిన బాధ మరొకవైపు ఆ పసిదాన్ని నిస్సహాయురాల్ని చేసింది.

ఎండ తీక్షణత ఎక్కువవసాగింది.

సృజన నిలబడలేక కళ్లు తిరిగి పడిపోయింది.

దూరంగా నిల్చున్న ఆయా సృజన దగ్గర చేరి ''ఏమైందమ్మా?'' అని అడగటంతో-

కళ్లు తెరచి ''ఏదో కరిచింది'' అంటూ కాలు చూపించి తల వేళ్లాడేసింది.

గబగబా దగ్గరలో వున్న ఆసుపత్రిలో చేర్చి సృజన ఇంటికి ఫోన్ చేసి విషయం తెలిపారు టీచర్లు.

★ ★ ★

రాఘవరావుగారు, అన్నపూర్ణమ్మగారు హడావిడిగా ఆసుపత్రి చేరుకున్నారు.

సృజన బెడ్‌పై నీరసంగా పడుకొని వుంది.

అప్పుడే వచ్చిన కోడలు లలిత, కొడుకు సృజనను చూసి గొల్లుమన్నారు.

టీచర్లు మిడిగుడ్లేసుకొని నిల్చున్నారు.

ఆయా ద్వారా జరిగిన ఘోరం తెల్సుకున్న రాఘవరావుగారు ఆవేశం ఆపుకోలేకపోయారు.

''ఒరే చూడరా! మూడేళ్లయినా నిండని పసిదాన్ని ఇంగ్లీషు పండితురాల్ని చేయాలనుకున్న నీ దురాశకు ఫలితం. పసిమొగ్గలుగా వున్న వాళ్లచేత బలవంతంగా ఇంగ్లీషు చదివిస్తున్నాం. తెలుగు వాతావరణం నుంచి



దూరం చేస్తున్నాం. కాన్వెంట్ స్కూల్లో తెలుగు మాట్లాడితే టీచర్ కొడుతుందని భయం. పిల్లలు బాల్యమంతా తమకు తెలియని కృత్రిమ వాతావరణంలో పెరుగుతున్నారు.

తెలుగు రాదు...మన సంస్కృతి తెలియదు. మాతృభాషలో భావవ్యక్తీకరణ సులువవుతుంది. మాతృభాషలో క్రియాత్మక శక్తి ఇమిడి వుంది. జపాన్, చైనా, రష్యా దేశాల్లో మాతృభాషకే పెద్దపీట వేసారు కనుకనే ఈనాడు అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరాయి.

పైగా ఈరోజు బాలల దినోత్సవం జరుపుకుంటున్నాం. మీ స్వార్థం కోసం పసిపిల్లలను ఎండలో గంటలకొద్దీ నిలబెట్టడం నేరం కాదా! పసిపిల్లల హక్కులు తెల్సా. 54 ఆర్టికల్స్‌తో కూడిన బాలల హక్కులను 192 దేశాలు ఆమోదించాయి. పిల్లల మౌలికమైన హక్కు తమ భావాలను స్వేచ్ఛగా తమ భాషలో వ్యక్తం చేయడం. కాని ఆ ప్రాథమిక హక్కునే మనం కాలరాస్తున్నాం.

పిల్లలు నోరారా తల్లిని 'అమ్మా...' అని పిలిస్తే దండించే తల్లులెందరో వున్నారు. పక్షులు, జంతువులు సైతం తమ భాషలో భావప్రకటన చేస్తుంటే వాటిని కన్న తల్లులు అడ్డుపడవు. కాని వాటికన్నా మూర్ఖంగా మనం మన పిల్లలకు మన భాష పట్ల ద్వేషభావాన్ని పెంపొందిస్తున్నాం.

ఇంగ్లీషు చదువుకోవద్దని కాదు నా ఉద్దేశం. పసిపిల్లలకు మాతృభాష నేర్పకపోవడం నిజంగా ఘోరాతిఘోరం. పసిపిల్లల భావప్రకటనా స్వేచ్ఛను కాలరాస్తున్నాం. పసివాళ్ళు మనసారా మాతృభాషలో మాట్లాడే హక్కును మనం కాలరాయడం క్షమించరాని నేరం...''

ఆయన ఆవేశంలోని ఆవేదన అక్కడ చేరినవారంతా గ్రహించారు.

అప్పుడే కళ్ళు తెరచిన సృజన చుట్టూ వున్న అందరినీ చూసి ''తాతయ్యా...'' అంటూ తాతయ్యని వాటేసుకొంది.

అమ్మను అమ్మా అని పిలిస్తే కోప్పడుతుందన్న భయంతో తాతయ్య, నానమ్మలను పిలిచింది సృజన.

తమకు తెలియకుండానే పసిదాని హక్కును కాలరాస్తున్న పెద్దల తలలు సిగ్గుతో నేలవాలాయి.

☆

**యం. ఉదయభాను**